

ఇకపై క్యూఆర్ కోడ్, ఫోన్‌పేలో చెల్లింపులు: కమిషనర్

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 21: నగరపాలక సంస్థలో ఇకపై చెల్లింపులు క్యూఆర్ కోడ్ విధానంలో ఫోన్‌పే, గూగుల్ పే, ఇతర ఆన్‌లైన్ పేమెంట్ల ద్వారా చేయవచ్చునని నగరపాలక సంస్థ కమిషనర్ ఎంఎం నాయుడు తెలిపారు. క్యూ ఆర్ కోడ్ విధానం చెల్లింపులు ఏ విధంగా అమలౌతున్నాయో బుధవారం స్వయంగా పరిశీలించారు. ఇక నుంచి నగరపాలక సంస్థలో ప్రజలు చెల్లించాల్సిన ఆస్తిపన్నులు, నీటి పన్నులు, ఇతర చెల్లింపులు క్యూఆర్ కోడ్ విధానంలో చేయవచ్చునని సూచించారు. నగదు చెల్లింపుల్లో పలు ఇబ్బందులు వస్తున్న నేపథ్యంలో ఈ విధానం తీసుకొచ్చినట్లు చెప్పారు.

గుంకలాంలో పునాది దశలోనే ఇళ్లు



సొంతిల్లు.. కలగానే!

పేదోడి సొంతింటి కలను.. గత వైసీపీ ప్రభుత్వం కలగానే మిగిల్చింది. జగనన్న ఇళ్ల నిర్మాణంలో ఆప్షన్-3 విధానం కింద నిరు పేదలకు పూర్తిగా ఇళ్లు నిర్మించి అందిస్తామని చెప్పుకొచ్చింది. నిర్మాణ బాధ్యతను రాక్రీట్ సంస్థకు అప్పగించింది. మొక్కుబడిగా ఆ సంస్థ కొన్ని ఇళ్లకు పునాదులు మాత్రమే వేసి చేతులు దులుపేసుకుంది. ఐదేళ్లలో ఒక్క ఇంటినీ నిర్మించలేక పోయింది. గుంకలాం లో ఆ స్థలాలన్నీ కళా విహీనంగా కనిపిస్తున్నాయి. అక్కడి దుస్థితికి కారణాలు తెలుసుకునేందుకు విజిలెన్స్ విచారణ సాగుతోంది.

-(విజయనగరం రూరల్)

- గుంకలాం, కొండకరకాంలో ఆప్షన్-3 కింద చేపట్టిన ఇళ్లు ఏవీ?
- నేటికీ పునాదులతోనే కనిపిస్తున్న వైనం
- ఒక్క ఇంటినీ పూర్తి చేయని రాక్రీట్ సంస్థ
- కొనసాగుతున్న విజిలెన్స్ విచారణ

పేదల ఇళ్ల నిర్మాణాల్లో మూడు విధానాలను తీసుకొచ్చిన జగన్ ప్రభుత్వం ఆప్షన్-3 కింద ఎంపిక చేసిన లబ్ధిదారులకు పూర్తిగా ఇళ్లు నిర్మించి అందిస్తామని చెప్పింది. ఆ విధంగా జిల్లాలో 6,055 ఇళ్ల నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. ఆ బాధ్యతను ప్రభుత్వం రాక్రీట్ సంస్థకు అప్పగించింది. అయితే రెండేళ్ల కాలంలో ఆ సంస్థ ఒక్క ఇంటిని కూడా పూర్తి చేయలేకపోయింది. దీంతో పేదోడి కళ్లల్లో ఆనందం ఆవిరైంది. గుంకలాం, కొండకరకాంలో ఆ ఇళ్ల నిర్మాణాలను చూస్తే ఎవరైనా విస్తుపోవాల్సిందే. కాగా విజయనగరం మండలం, కార్పొరేషన్ పరిధిలో ఉంటున్న నిరుపేదలకు 'జగనన్న ఇళ్ల పథకం' కింద గుంకలాం, కొండకరకాంలో భూమిని సేకరించారు. గుంకలాంలో 10,139 మందికి, కొండకరకాంలో 1,437 మందికి తొలి దశలో ఇళ్లు మంజూరు చేశారు. నిర్మాణాలకు మూడు పద్ధతులు (ఆప్షన్-1, ఆప్షన్-2, ఆప్షన్-3) తెరపైకి తీసుకొచ్చారు. ఆప్షన్-1, 2లో లబ్ధిదారే నిర్మించుకునేలా అప్పటి ప్రభుత్వం నిబంధనలను రూపొందించింది. మూడో ఆప్షన్ కింద ఇళ్ల నిర్మాణాల కోసం ప్రభుత్వం ఒక సంస్థను ఎంపిక చేసింది. ఈ మేరకు రాక్రీట్ సంస్థ గృహనిర్మాణశాఖతో ఎంఓయూ (2022లో) కుదుర్చుకుంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా ఒక లబ్ధిదారుడికి రూ.1,80,000 యూనిట్ కాస్ట్‌గా నిర్ణయించి, దశలవారీగా ఆ నిధులను రాక్రీట్ అకౌంట్‌కు ప్రభుత్వం జమ చేసింది. ఆ ప్రకారం గుంకలాంలో 5,097 ఇళ్లు, కొండకరకాంలో 958 ఇళ్లు కలిపి మొత్తంగా 6,055 ఇళ్లు నిర్మించి అందివ్వాలి.

ఇళ్ల పరిస్థితి దయనీయం..

ఆప్షన్-3లో ఇంతవరకూ 66 ఇళ్లకు మాత్రమే శ్లాబ్‌లు (ఆర్‌సీ దశ) వేశారు. లింటల్ స్థాయిలో (ఆర్‌ఎల్ దశ) 74 ఇళ్లు, మిగతావి ప్లింట్ బీమ్, పునాదులు (బీఎల్‌దశ)లో ఉన్నాయి. 6,055 ఇళ్లలో ఒక్కటంటే ఒక్క ఇల్లు కూడా పూర్తికాలేదు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం పీబీ, బీఎల్, ఆర్‌ఎల్, ఆర్‌సీ, కంప్లీట్ ఇలా ఐదు దశల్లో ప్రభుత్వం బిల్లులు చెల్లించింది. అయితే రాక్రీట్ సంస్థకు ప్రభుత్వం ఎంత మొత్తం జమ చేసింది? ఐదు దశల్లో కాకుండా ఒకే దశలో మొత్తం రూ.1, 80, 000 చొప్పున రాక్రీట్ సంస్థకు బదిలీ చేశారా? అన్నది విజిలెన్స్ దర్యాప్తులో తేలనుంది. ఈ సంస్థ 2024 జనవరి 27 నుంచి నిర్మాణాలు పూర్తిగా ఆపేసింది.

త్వరలో ప్రభుత్వానికి నివేదిక..

విజయనగరం మండల పరిధిలోని గుంకలాం, కొండ కరకాంలో రాక్రీట్ సంస్థ చేపట్టిన గృహ నిర్మాణాలపై నెల రోజుల నుంచి ప్రాంతీయ విజిలెన్స్ ఎన్‌ఫోర్సు మెంటు విభాగం అధికారులు విచారిస్తున్నారు. విజిలెన్స్ ఎస్పీ ఎ.సురేష్‌బాబు విజయ నగరం మండల పరిధిలోని గుంకలాం, కొండకరకాం గ్రామాల్లో ఇటీవల ఇళ్ల నిర్మాణాలను తనిఖీ చేశారు. ఇసుక, సిమెంట్, ఐరన్ తదితర వాటిపై వస్తున్న ఆరోపణలపైనా ఆరా తీశారు. ప్రభుత్వానికి విన్నవించేందుకు నివేదిక సిద్ధం చేస్తున్నారు.

ఎన్నెన్నో అక్రమాలు

- ఖాళీ స్థలాల్లో ఇళ్ల పునాదులు
- పట్టా ఒకరిది.. పునాది మరొకరిది

జగనన్న లేఅవుట్లలో అక్రమాలు ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయి. నేతల అండతో అప్పట్లో ఖాళీ స్థలాల్లో కొందరు ఇళ్ల నిర్మాణం ప్రారంభించేశారు. ఇంకొందరు హద్దు మీరి కొలతలు పెంచుకుంటూ పోయారు. మిగులు స్థలాల్లో మొక్కలు వేసిన వారు కొందరు. పట్టా ఒకరి పేరుతో ఉండగా నిర్మాణం మరొకరు చేస్తున్న ఘటనలు కోకొల్లలు. ఇవన్నీ తెలిసినా చర్యలు ఉండవన్న అభిప్రాయంతో గత ఐదేళ్లలో ఎవరూ ఫిర్యాదు చేసేందుకు ముందుకు రాలేదు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో వెల్లువలా ఫిర్యాదులు అందుతున్నాయి. దీనిపై అధికారులు రంగంలోకి దిగి విచారిస్తున్నారు.

\- గంట్యాడ

● గంట్యాడ మండలంలోని నరవ గ్రామంలో జగనన్న లేఆవుట్‌లో కొంతమంది అనధికారికంగా, పట్టాలు లేకుండా పునాదులు నిర్మించుకున్నారని ఇటీవల జరిగిన గ్రామ సందర్శనలో నోడల్ అధికారికి పలువురు ఫిర్యాదు చేశారు. దీనిపై గ్రామ రెవెన్యూ కార్యదర్శులు, సర్వేయర్లు విచారించారు. ఆ లేవుట్‌లో 180 ప్లాటు వేయగా 142 మందికి పట్టాలు మంజూరు చేశారు. ఖాళీగా ఉన్న స్థలాల్లో పట్టాలు లేకుండా కొందరు పునాదులు నిర్మించినట్లు గుర్తించారు. సుమారు 10 మంది అలా చేసినట్లు సమాచారం.

గత ప్రభుత్వం ఇళ్లే కాదు ఊళ్లే నిర్మిస్తున్నామని పెద్ద ఎత్తున ప్రచారం చేసుకుంది. జిల్లా వ్యాప్తంగా సుమారు 930 జగనన్న లేఅవుట్లు వేయగా వీటిల్లో దాదాపు 52 వేల ఇళ్ల పట్టాలు మంజూరు చేసినట్లు అధికారిక లెక్కలు వెల్లడిస్తున్నాయి. లేఅవుట్లు వేసిన సమయంలో ప్రభుత్వ భూమి కాని, గ్రామానికి సమీపంలో ప్రత్యేకంగా భూమిని కొనుగోలు చేసి కాని పట్టాలు మంజూరు చేసింది. అయితే కొన్నిచోట్ల పట్టాలు ఇచ్చిన స్థలాలు లబ్ధిదారులకు నచ్చకపోవడంతో ఇళ్ల నిర్మాణం చేపట్టలేదు. ఆ లేఆవుట్లు ఖాళీగానే ఉన్నాయి. మరికొన్ని చోట్ల అనర్హులకు పట్టాలు ఇచ్చారు. ఇంకొన్ని చోట్ల పట్టాలు ఒకరి పేరున ఉండగా నిర్మాణం వేరొకరు చేపట్టారు. ఎక్కడికక్కడే పట్టాలు చేతులు మారిపోయాయి. చాలా లేఅవుట్లలో మౌలిక సదుపాయాలు లేక ఇద్దరో.. ముగ్గురో పనులు చేపట్టి మధ్యలో వదిలేశారు.

కొద్దిరోజుల కిందట జిల్లాలో పర్యటించిన రెవెన్యూ శాఖ ముఖ్య కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా జిల్లాలో పేదల ఇళ్ల పథకంలో కేటాయించిన భూముల వివరాలను నిర్దేశిత ప్రొఫార్మాలో సమర్పించాలని సూచించారు. ఈ పథకం కింద ఎంత భూమి కేటాయించారు? అందులో ప్రభుత్వ భూమి ఎంత? డి.పట్టా భూమి ఎంత? ఎంత భూమిని కొనుగోలు చేశారు? పరిహారం ఎంత చెల్లించారు? ఇళ్ల కోసం కేటాయించగా ఇంకా ఎంత స్థలం మిగిలింది? తదితర వివరాలను రెవెన్యూ సదస్సుల్లో సమర్పించాలని అధికారులకు ఆదేశించారు. ఈ వివరాలు వెల్లడైతే జగనన్న లేఅవుట్లలో ఉన్న లోపాలు మరిన్ని బట్టబయలయ్యే అవకాశం ఉంది.



నరవలో జగనన్న లేఅవుట్‌లో పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)



ఒకటి నుంచి పశుగణన

- 16 రకాల పశు సంపదపై దృష్టి
- ఇప్పటికే పూర్తయిన శిక్షణ
- నాలుగు నెలల పాటు ప్రక్రియ

(విజయనగరం రూరల్/ రింగురోడ్డు)

జిల్లాలో పశుగణన ప్రక్రియ సెప్టెంబరు 1న ప్రారంభం కానుంది. నాలుగు నెలల పాటు ఈ తంతు కొనసాగనుంది. ఐదేళ్లకు ఒకసారి చేపట్టే ఈ గణన 2019లో జరిగింది. పశు సంవర్ధక శాఖ సిబ్బంది ఈ విధుల్లో ఉంటారు. ఆవులు, గేదెలు, గొర్రెలు, మేకలు, గుర్రాలు, గాడిదలు, పందులు, పెంపుడు కుక్కలు, ఏనుగులు, కోళ్లు ఇలా 16 రకాల పశు సంపదను లెక్కకట్టనున్నారు. గతంలో మాన్యువల్‌గా నిర్వహించే ఈ కార్యక్రమం ఈసారి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి చేపట్టనున్నారు. ఇందుకోసం రాష్ట్ర పశు సంవర్ధక శాఖ ప్రత్యేక యాప్‌ను తీసుకువచ్చింది. గణన కోసం క్షేత్రస్థాయిలో ఎన్యుమరేటర్లు, వీరిని పర్యవేక్షించేందుకు సూపర్‌వైజర్లు, ఆపై జిల్లా స్థాయిలో నోడల్ అధికారిని నియమించారు. జిల్లా నోడల్ అధికారిగా పశు సంవర్ధకశాఖాధికారి డాక్టరు లోకేష్‌ని నియమించారు. పశుగణన కోసం 68 మంది సూపర్‌వైజర్లు, 225 మంది ఎన్యుమరేటర్లను నియమించారు. పశు సంవర్ధకశాఖ సహాయ సంచాలకులు, పారా సిబ్బంది, గోపాలమిత్రలు కూడా సహకరిస్తారు. వీరికి పశు సంవర్ధక శాఖ జేడీ రమణ ఆదేశాల మేరకు ఎన్యుమరేటర్స్, సూపర్‌వైజర్లకు మూడు దఫాలుగా శిక్షణ నిర్వహించారు. ప్రభుత్వం రూపొందించిన యాప్ గురించి కూడా విస్తృతంగా అవగాహన కల్పించారు.

అంతా సిద్ధం

రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో పశుగణనకు అంతా సిద్ధం చేశాం. నాలుగు నెలల పాటు జరిగే ఈ ప్రక్రియ కోసం 225 మంది ఎన్యుమరేటర్లు, 68 మంది సూపర్‌వైజర్ల సేవలు వినియోగించుకుంటున్నాం. అధునాతన సాంకేతిక పరిజ్ఞానంతో గణన చేపడుతున్నాం. ఈ గణన కోసం ప్రభుత్వం ప్రత్యేక యాప్ విడుదల చేసింది. సెప్టెంబరు 1న ప్రారంభమయ్యే ఈ సర్వేని డిసెంబరు 31లోగా పూర్తిచేస్తాం.

\- డాక్టరు లోకేష్, నోడల్ అధికారి, పశుగణన ప్రక్రియ

రూ.3.26 కోట్ల రుణమేనా?

- తక్కువగా ఇవ్వడంపై కలెక్టర్ అసంతృప్తి
- ప్రతి కౌలు రైతుకూ రుణాలు అందించాలని ఆదేశం



మాట్లాడుతున్న కలెక్టర్ అంబేడ్కర్

కలెక్టరేట్, ఆగస్టు 21: జిల్లాలో కౌలు రైతులకు ఖరీఫ్ సీజన్‌లో రూ.70 కోట్ల రుణాలు మంజూరు చేయాలని లక్ష్యం పెట్టుకోగా, ఇప్పటివరకూ రూ.3.26 కోట్లు మాత్ర మే మంజూరు చేయడంపై కలెక్టర్ అంబేడ్కర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో బ్యాంకర్లు, వ్యవసాయ శాఖ అధికారులతో బుధవారం మధ్యాహ్నం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 15,500 సీసీఆర్‌సీ(క్రాప్ కల్టివేటర్ రైట్స్ కార్డు) రైతులకు అందించాల్సి ఉండగా, ఇప్పటికే 14,860 కార్డులు అందజేశామని, మిగిలిన వాటిని రెండు రోజుల్లో అందజేయా లని వ్యవసాయ అధికారులకు ఆదేశించారు. బ్రాంచి వారీగా ఇప్పటివరకూ ఏయే బ్యాంకులు... ఎంతెంత రుణాలను ఇచ్చిందీ అడిగి తెలుసుకున్నారు. ఈ సీజన్‌లో శతశాతం రుణాలు అందిచేలా బ్యాంకులు ముందుకు రావాలని సూచించారు. రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను రెండు రోజుల్లో అన్ని బ్యాంకులకు పంపాలని, వారం లోపలే వాటిని పరిశీలించి, అర్హుల జాబితాను తయారు చేయాలన్నారు. ప్రతి కౌలుదా రుడుకి రుణాలు అందించాలని చెప్పారు. అనంతరం జేసీ సేతు మాదవన్ మాట్లాడు తూ ప్రతి సోమవారం మధ్యాహ్నం కౌలు రుణాలపై బ్యాంకర్లు, వ్యవసాయాధికారులతో సమీక్షిస్తానని, పూర్తి సమాచారంతో తప్పకుండా హాజరుకావాలని చెప్పారు. సకాలంలో రుణాలు మంజూరు చేయాలని బ్యాంకర్లను కోరారు. సమావేశంలో వ్యవసాయ శాఖ జేడీ తారక రామారావు, ఎల్‌డీఎం మూర్తి, పశుసంవర్ధక శాఖ జేడీ రమణ తదితరులు ఉన్నారు.

ఎస్‌ఐల బదిలీలు

విజయనగరం(ఆంధ్రజ్యోతి): విశాఖ రేంజ్ పరిధిలో పలువురు ఎస్‌ఐలకు బదిలీ చేస్తూ డీఐజీ కార్యాలయం బుధవారం ఆదేశాలు ఇచ్చింది. వాటిని వెంటనే అమలు చేయాలని అందులో పేర్కొంది.

పేరు	ప్రస్తుతం	బదిలీస్థానం
వి.జగదీశ్వరరావు	విశాఖపట్నం సిటీ	డీఎస్‌బి, విజయనగరం
సీహెచ్ శంకరరావు	విశాఖపట్నం సిటీ	విజయనగరం టూటౌన్
ఎస్.చిన్నయ్య	విశాఖపట్నం సిటీ	సీసీఎస్, విజయనగరం
పి.నారాయణరావు	మహిళా పోలీస్‌స్టేషన్	గుర్ల స్టేషన్
జె.తారకేశ్వరరావు	విజయనగరం(వీఆర్)	బాడంగి స్టేషన్
వి.ప్రసాదరావు	పీటీసీ విజయనగరం	రామభద్రపురం స్టేషన్
బి.సాగర్‌బాబు	సీసీఎస్ టాస్క్‌ఫోర్స్	తెర్లాం పోలీస్‌స్టేషన్
ఎల్.ధర్మారావు	గరివిడి స్టేషన్	చీపురుపల్లి స్టేషన్
బి.లోకేశ్వరరావు	బుదరాయవలస	గరివిడి స్టేషన్

విజయనగరం డీఎస్పీగా చిట్టిబాబు

విజయనగరం క్రైం, ఆగస్టు 21: విజయనగరం డీఎస్పీగా ఇనుకుర్తి చిట్టిబాబుని నియమిస్తూ, రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన గతంలో విశాఖపట్నం సీటీలో టాస్క్‌ఫోర్సు ఏసీపీగా, సీఐడీ డీఎస్పీగా విధులు నిర్వహించారు. ప్రస్తుతం ఐదో బెటాలియన్ (చింతలవలస)లో అసిస్టెంట్ కమాండెంట్‌గా పనిచేస్తున్నారు. తాజాగా విజయనగరం డీఎస్పీగా బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ బాధ్యతలు నిర్వహిస్తున్న గోవిందరావును డీజీపీ ఆఫీసులో రిపోర్టు చేయాల్సిందిగా ఉత్తర్వుల్లో పేర్కొంది.

14 నుంచి రాజాం గ్రామదేవత ఉత్సవాలు

రాజాం రూరల్, ఆగస్టు 21: రెండేళ్లకోసారి రాజాంలో నెలరోజుల పాటు ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించే రాజాం, సారధి గ్రామ దేవతలు కోటదుర్గమ్మ తల్లి, బురదల పోలమ్మతల్లి, బంగారమ్మ తల్లి ఉత్సవాలకు సంబంధించి తేదీలు ఖరార య్యాయి. సెప్టెంబరు 14 నుంచి అక్టోబరు 15 వరకూ నెలరోజుల పాటు ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఈమేరకు పెద సేనాధి పతి దాసరి పోలీసు, రాజాం, సారధి గ్రామ దేవతల ఉత్సవ కమిటీ, పెద్దల ఆధ్వర్యంలో బుధవారం ఓ నిర్ణయానికొ చ్చారు. వచ్చేనెల 14న ఉత్సవాలకు సంబంధించి చాటింపు ఉంటుంది. 15 నుంచి 17 వరకూ అమ్మవార్లకు ఉపారాలు తీసేలా తేదీలను నిశ్చయించారు. ఆ తర్వాత నుంచి కీలకమైన తిరువీధి ఘటోత్సవాలు ప్రారంభం కానున్నాయి. సెప్టెంబరు 22న ఆదివారం మొదటి ఘటం తిరువీధి ఉంటుంది. అదే నెల 24, 29 తేదీల్లో రెండు, మూడో ఘటం ఊరేగింపు ఉంటుంది. అక్టోబరు 1, 6, 8, 10, 13, 15 తేదీల్లో మిగతా ఘటోత్సవాలు జరుగుతాయి.

బంద్ ప్రశాంతం

- ఎస్సీ వర్గీకరణను నిరసిస్తూ మిన్నంటిన నిరసనలు
- మధ్యాహ్నం తరువాత యథావిధిగా బస్సులు, వ్యాపార సంస్థలు

విజయనగరం రూరల్/దాసన్నపేట, ఆగస్టు 21: భారత అత్యున్నత న్యాయస్థానం ఎస్సీ, ఎస్టీలను వర్గీకరించేందుకు రాష్ట్రాలకు అనుమతినిస్తూ ఇచ్చిన తీర్పులను నిరసిస్తూ చేపట్టిన భారత్ బంద్ పిలుపులో భాగంగా జిల్లాలో దళిత సంఘాలు బంద్‌ను పర్యవేక్షించాయి. ఆయా ప్రాంతాల్లో నిరసన తెలియజేస్తూ నినాదాలు చేశారు. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, స్కూల్స్‌ను మూయించారు. కొన్ని స్కూల్స్ స్వచ్ఛందంగా ముందుగానే సెలవు ప్రకటించాయి. అయితే ఎక్కడ ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదు. ప్రశాంతంగా, ప్రజాస్వామ్యయుతంగా నిరసన చేపట్టారు. బుధవారం మధ్యాహ్నం వరకు ఆర్టీసీ బస్సులు పెద్దగా తిరగలేదు. అనేక వర్తక, వాణిజ్య సంస్థలు మూతపడ్డాయి. ఆ తర్వాత అన్ని యథావిధిగా పనిచేశాయి. విజయనగరంలో బంద్‌ను పోరాట సమితి నాయకులు పాండ్రంకి వెంకట రమణ, దాన రాంబాబు, సింహాచలం, రవిశంకర్, అప్పారావు, లక్ష్మణరావు, భానుమూర్తి, వీర్రాజు, జగదీష్ తదితరులు పర్యవేక్షించారు.



విజయనగరం ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద బంద్‌ను పర్యవేక్షిస్తున్న సంఘాలు



విజయనగరం డిపోలో మధ్యాహ్నం వరకు నిలిచిపోయిన ఆర్టీసీ బస్సులు



శ్రీకాకుళం నుంచి విశాఖ వెళ్లే జాతీయ రహదారిపై నిలిచిపోయిన భారీ వాహనాలు



తిరుమలలో చిరంజీవి

- కుటుంబ సభ్యులతో కలసి నేడు శ్రీవారి దర్శనం

మెగాస్టార్ చిరంజీవి శ్రీవారి దర్శనార్థం బుధవారం తిరుమలకు చేరుకున్నారు. రాత్రి 8గంటలకు తిరుమలలోని ఫీనిక్స్ అతిథిగృహానికి చేరుకున్న ఆయనకు టీటీడీ రిసెప్షన్ అధికారులతో పాటు అభిమానులు స్వాగతం పలికారు. చిరంజీవితో పాటు ఆయన సతీమణి సురేఖ, తల్లి అంజనా దేవి కూడా తిరుమలకు చేరుకున్నారు. అంతకుముందు సాయంత్రం కుమార్తె శ్రీజ కాలినడకన తిరుమలకు చేరుకున్నారు. గురువారం చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఆలయంలో వేకువజామున జరిగే సుప్రభాతసేవలో పాల్గొని శ్రీవారిని దర్శించుకోనున్నారు.


తిరుమల, (ఆంధ్రజ్యోతి)

బ్లాక్‌బస్టర్ పక్కా



నాని, ప్రియాంక మోహన్ జంటగా నటించిన పాన్ ఇండియా చిత్రం 'సరిపోదా శనివారం'. ఎస్.జే సూర్య, సాయికుమార్ కీలక పాత్రలు పోషించారు. వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి నిర్మించారు. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలు, ట్రైలర్ అందరినీ ఆకట్టుకుని సినిమాపై అంచనాలను పెంచేశాయి. ఈ నెల 29న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా చిత్రబృందం మీడియాతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో నాని మాట్లాడుతూ "ఈ సినిమా కోసం చిత్రబృందం ఎంతో కష్టపడింది. ఆ కష్టం తెరపై కనపడుతుంది. వారి కోసం ఈ సినిమా పెద్ద హిట్టవ్వాలి. ఈ సినిమాకు వివేక్ రైటింగ్, జేక్స్ బిజోయ్ సంగీతం స్పెషల్ అట్రాక్షన్. నాకు కోపం వచ్చింది. అలా కోపం వచ్చిందంటే బ్లాక్‌బస్టర్ పక్కా" అని చెప్పారు. "ఈ సినిమాలో ఎస్.జే. సూర్య, నాని పోటాపోటీగా నటించారు. వివేక్ నుంచి ఇటువంటి కమర్షియల్ సినిమా అస్సలు ఊహించలేదు. సినిమాను డైరెక్టర్ ఓ రేంజ్‌లో తీశారు" అని దిల్‌రాజు అన్నారు. "ఈ సినిమాకు కథే బలం. సినిమా అద్భుతంగా వచ్చింది" అని చిత్ర నిర్మాత డి.వి.వి.దానయ్య తెలిపారు.

ముఫాసాకు మహేశ్ వాయిస్



ప్రపంచవ్యాప్తంగా అందరినీ ఆకట్టుకున్న 'ది లయన్ కింగ్' చిత్రానికి ఇప్పుడు సీక్వెల్ వస్తోంది. 'ముఫాసా ది లయన్ కింగ్' పేరుతో వస్తున్న ఈ చిత్రం తెలుగు వెర్షన్‌లో ముఫాసాకు మహేశ్‌బాబు వాయిస్ అందిస్తుండడం ఆసక్తికరం. ఈ సినిమా హిందీ వెర్షన్‌కు షారుఖ్ ఖాన్ డబ్బింగ్ చెప్పారు. తెలుగు వెర్షన్‌లో పుంబా పాత్రకు బ్రహ్మానందం, టిమోన్ పాత్రకు అలీ డబ్బింగ్ చెప్పారు. తెలుగు వెర్షన్ ట్రైలర్‌ను ఈ నెల 26న విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా మహేశ్ మాట్లాడుతూ 'డిస్నీతో అనుబంధం నాకు ప్రత్యేకమైంది. తన కొడుకు అంటే అభిమానం కలిగిన పాత్ర ముఫాసా. అంతేకాదు అడవికి రారాజు. ఆ పాత్రకు నేను వాయిస్ అందించడం నా పిల్లలతో ఎంతో ఆనందంగా సెలబ్రేట్ చేసుకునే సందర్భం ఇది' అన్నారు. డిసెంబర్ 24న 'ముఫాసా ది లయన్ కింగ్' విడుదలవుతుంది.



సిద్ధు కోసం శ్రీనిధి

సిద్ధు జొన్నలగడ్డ తాజా చిత్రం 'తెలుసు కదా' చిత్రం షూటింగ్ హైదరాబాద్‌లో కొనసాగుతోంది. స్టైలిస్ట్ నీరజ కోన ఈ సినిమాతో దర్శకురాలిగా పరిచయమవుతున్నారు. ఇందులో రాశీ ఖన్నా శ్రీనిధి శెట్టి హీరోయిన్లుగా నటిస్తుండగా, తాజా షెడ్యూల్‌లో శ్రీనిధి జాయిన్ అయ్యారు. కీలకమైన సన్నివేశాల చిత్రీకరణ జరుగుతోంది. ఈ చిత్రానికి సహ నిర్మాత: వివేక్ కూచిభొట్ల, నిర్మాత: టీజీ విశ్వప్రసాద్.

తెలుగులోనూ ఆదరిస్తారు



హారర్ థ్రిల్లర్‌గా ప్రేక్షకులను భయపెట్టిన 'డీమాంటి కాలనీ'కి సీక్వెల్‌గా తెరకెక్కిన తమిళ చిత్రం 'డీమాంటీ కాలనీ 2'. అజయ్.ఆర్.జ్ఞానముత్తు దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాను బి.సురేశ్ రెడ్డి, బి.మానస రెడ్డి నిర్మించారు. అరుల్‌నిధి, ప్రియా భవానీశంకర్ ముఖ్య పాత్రల్లో నటించారు. సినిమా ఈ శుక్రవారం విడుదలవుతోన్న సందర్భంగా చిత్రబృందం ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథి రామ్‌గోపాల్ వర్మ మాట్లాడుతూ "మంచి కంటెంట్ ఉన్న ఇలాంటి సినిమాను తెలుగులోను ఆదరిస్తారు" అని చెప్పారు. "ఈ సినిమాకు కొనసాగింపుగా మరో రెండు భాగాలు ఉంటాయి" అని దర్శకుడు అజయ్.ఆర్.జ్ఞానముత్తు అన్నారు.

అద్భుతమైన కంటెంట్‌తో 'రేవు'



వంశీ రామ్ పెండ్యాల, అజయ్, స్వాతి భీమిరెడ్డి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'రేవు'. హరినాథ్ పులి దర్శకత్వంలో డా.మురళి గింజుపల్లి, నవీన్ పారుపల్లి నిర్మించారు. సీనియర్ జర్నలిస్టులు ప్రభు దర్శకత్వ పర్యవేక్షణ చేపట్టగా, పి.రాంబాబు ఎగ్జిక్యూటివ్ నిర్మాతగా వ్యవహరించారు. ఈ శుక్రవారం సినిమా విడుదలవుతున్న సందర్భంగా చిత్రబృందం మీడియాతో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు హరినాథ్ మాట్లాడుతూ "ఈ సినిమా కంటెంట్ అద్భుతంగా ఉంటుంది. అందరూ మెచ్చే చిత్రమిది" అని అన్నారు. "ఈ సినిమాను థియేటర్‌లో చూసి ఎగ్జైట్ అవుతారు" అని నిర్మాత డా.మురళి గింజుపల్లి అన్నారు.

SCHOLARSHIP ALERT

Reliance Foundation Undergraduate

Description: The Reliance Foundation Under graduate Scholarships aim to support meritorious students from all corners of the country in pursuing their undergraduate education. This empowers them to continue their studies, be come successful professionals, and realize their dreams, unlocking their potential to uplift themselves and their communities and contribute towards India's future socio-economic development.

Eligibility: Students must be enrolled in the first year of a full-time regular undergraduate (UG) de gree in any stream at a recognised Indian institute. ● Must have passed Class 12 with a minimum of 60% marks. ● The annual household income should be up to INR 15,00,000 per year (preference will be given to those students whose family income is less than INR 2,50,000)

● Open for resident Indian citizens only. An aptitude test is mandatory.

Prizes & Rewards: Up to INR 2,00,000 over the duration of the degree

Last Date to Apply: 06-10-2024

Application mode: Online only

Short Url: ww.b4s.in/aj/RFS11

దిక్సూచి

SBIF Asha

Description: The SBIF Asha Scholarship Program 2024, one of India's largest scholarship programs, is an initiative of the SBI Foundation. This scholarship aims to provide financial assistance to meritorious students from low-income families across India, ensuring the continuity of their education.

Eligibility: Open to school students from Class 6 to 12 and undergraduate & postgraduate students from the top 100 NIRF universities/colleges, undergraduate students from IITs, and students pursuing MBA/PGDM courses from IIMs. Applicants must have scored a minimum of 75% marks in the previous academic year. Their gross annual family income must be up to INR 6 lakh (Up to INR 3 lakh for Class 6-12 students).

Prizes & Rewards: **Classes 6 to 12:** INR 15,000 each

- **UG Students:** Up to INR 50,000
- **PG Students:** Up to INR 70,000
- **UG Students from IITs:** Up to INR 2,00,000
- **MBA Students from IIMs:** Up to INR 7,50,000


Last Date: 01-10-2024


Short Url: www.b4s.in/aj/SBIFS7

buddy4study.com

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/LAnmSITలో చదవండి.









రహదారి భద్రతకు సహకరించాలి

● నిబంధనలు పాటించకుంటే ఆటోలను సీజ్ చేస్తాం

● ఎస్పీ వకుల్ జిందాల్

విజయనగరం క్రైం, ఆగస్టు 21: జిల్లాలోని ఆటో డ్రైవర్లు రహదారి భద్రతకు సహకరించాలని ఎస్పీ వకుల్ జిందాల్ సూచించారు. బుధవారం మెసా నిక్ టెంపుల్లో ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో రహదారి భద్రతా పట్ల ఆటో డ్రైవర్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్పీ వకుల్ జిందాల్ హాజరై మాట్లాడుతూ, రహదారి భద్రత అందరి బాధ్యతన్నారు. ఆటో డ్రైవర్ల నిర్లక్ష్యం కారణంగా ఎక్కువ రహదారి ప్రమాదాలు, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఆటోలకు రిజిస్ట్రేషన్ పత్రాలు, డ్రైవింగ్ లైసెన్సు తప్పనిసరిగా ఉండాలని హెచ్చరించారు. ముఖ్య కూడళ్లల్లో ఆటోలను సక్రమంగా క్రమబద్ధంగా నిలుపుకోవాలన్నారు. ఆటోల్లో పరిమితికి మించి ప్రయాణికులను అనుమతించ వద్దని, యూనిఫాం ధరించాలని, నిబంధనలకు విరుద్ధంగా ఆటోల్లోకి స్కూల్ పిల్లలను అనుమతించవద్దన్నారు. నిబంధనలు పాటించకుంటే, ఆటోలను సీజ్ చేస్తామన్నారు. ట్రాఫిక్ సీఐ సూర్యనారాయణ మాట్లాడుతూ, ఆటో డ్రైవర్లు నిర్లక్ష్యంగా అస్తవ్యస్తంగా పార్కింగ్ చేయడంతో ఇబ్బందులు తలెత్తున్నాయన్నారు. రోడ్డు సేఫ్టీ ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు మజ్జి అప్పారావు మాట్లాడుతూ, ఆటో డ్రైవర్లతో సమావేశం నిర్వహించి, రహదారి భద్రత పట్ల ఎస్పీ వకుల్ జిందాల్ అవగాహన కల్పించడం శుభ పరిణామమన్నారు. సీఐలు విజయనాథ్, శ్రీనివాస్, పి.శ్రీనివాసరావు, ఎస్ఐలు మహేశ్వరరాజు, రవి, నవీన్‌పడాల్, ఆటో డ్రైవర్లు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ

ఎస్పీని కలిసిన సీఐలు

జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌ను బాధ్యతలు చేపట్టిన సీఐలు బుధవారం ఎస్పీ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మహిళా పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టరుగా బాధ్యతలు చేపట్టిన నర్సింహమూర్తి, ఎస్‌బీ-2 ఇన్‌స్పెక్టరుగా బాధ్యతలు చేపట్టిన ఏవీ లీలారావు, రాజాం అర్బన్ పోలీసు స్టేషన్ సీఐగా బాధ్యతలు చేపట్టిన కె అశోక్ కుమార్, బొబ్బిలి సర్కిల్ ఇన్‌స్పెక్టరుగా బాధ్యతలు చేపట్టిన కె నారాయణ రావు, బొబ్బిలి అర్బన్ ఇన్‌స్పెక్టరుగా బాధ్యతలు చేపట్టిన కె సతీష్‌కుమార్ మర్యాదపూర్వకంగా మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ వకుల్ జిందాల్ మాట్లాడుతూ, శాంతి భద్రతల సమస్యలు ఉత్పన్నం కాకుండా పటిష్ఠ చర్యలు చేపట్టాలని, విజిబుల్ పోలీసింగు విధిగా నిర్వహించాలని, ప్రజలకు అందుబాటులో ఉండాలని దిశా నిర్దేశం చేశారు.

ఇసుక స్టాక్ పాయింట్ తనిఖీ చేసిన జేసీ

బొబ్బిలి, ఆగస్టు 21: స్థానిక ఏపీఐఐసీ గ్రోత్‌సెంటరులో గల ప్రభుత్వ ఇసుక స్టాకుపాయింట్‌ను బుధవారం రాత్రి జేసీ సేతు మాధవన్ తనిఖీ చేశారు. భారీ వర్షం కురుస్తున్నప్పటికీ ఆయన స్థానిక ఆర్డీవో కార్యాలయానికి సిబ్బందిని రప్పించారు. ఇసుక కోసం ఇతర జిల్లాలకు చెందిన భారీ వాహనాలు క్యూ కట్టి ఉండడంపై ఆరా తీశారు. రోజువారీ ఇసుక విక్రయవిధానానికి సంబంధించి ఎటువంటి పద్ధతులు పాటిస్తున్నారు.. ఏ ప్రాతిపదికన ఇసుకను పంపిణీ చేస్తున్నారని రెవెన్యూ, మైనింగ్, ఎస్ఈబీ అధికారులను అడిగి తెలుసుకున్నారు. రికార్డుల్లో రాస్తున్న ఆధారనంబర్లు, ఇతర వివరాలు ఎంతమేరకు పారదర్శకంగా ఉన్నాయో పరిశీలించారు. తూనికయంత్రం లేకపోవడంతో వాల్యూమ్ అంచనా పద్ధతిలో ఇసుక పంపిణీ చేస్తున్నట్లు అధికారులు ఆయనకు వివరించారు. ఈ స్టాకు పాయింట్ నుంచి ఇసుక అక్రమంగా రవాణా అవుతున్నట్లు పెద్దఎత్తున ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో జేసీ తనిఖీకి ప్రాధాన్యం ఏర్పడింది. ఇతర జిల్లాలకు పంపిణీ చేస్తున్న ఇసుక వివరాలను సమగ్రంగా అందజేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఆర్డీవో ఆదిమూలం సాయిశ్రీ, తహసీల్దారు ఎం.శ్రీను, ఇరిగేషన్ డీఈఈ తిరుమలరావు, మైనింగ్ అధికారి, ఎస్ఈబీ ఎస్ఐ రామారావు, డీటీ సాయికృష్ణ, ఆర్ఐ కల్యాణచక్రవర్తి, ఎస్ఐ లోవరాజు తదితరులు పాల్గొన్నారు.


ఇసుక పంపిణీకి సంబంధించిన రికార్డులను పరిశీలిస్తున్న జేసీ సేతు మాధవన్

● ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇసుక స్టాక్ పాయింట్లను తనిఖీ చేశామన్నారు. జిల్లాలో ఇసుక పంపిణీకి సంబంధించి కలెక్టర్, ఎస్పీ సంయుక్తంగా సమావేశం నిర్వహించి పూర్తి వివరాలను వెల్లడిస్తారని, ఇసుక పంపిణీ తీరు, విధి విధానాలపై వివరిస్తారన్నారు.

వీఆర్ఏల సమస్యల పరిష్కారానికి సహకరించండి

లక్కవరపుకోట/వేపాడ: చాలీచాలని వేతనాలతో దుర్భరమైన జీవితాలను వెళ్లదీస్తున్న గ్రామ రెవెన్యూ అసిస్టెంట్ల సమస్యల పరిష్కారానికి సహకరించాలని కోరుతూ శృంగవరపుకోట నియోజకవర్గ పరిధిలోని వీఆర్యేలు ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారికి వినతిపత్రం అందజేశారు. బుధవారం లక్కవరపుకోట మండల కేంద్రంలో గల ఎమ్మెల్యే స్వగృహంలో లలితకుమారిని వీఆర్యేల సంఘ నాయకులు కలిశారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో సుమారు 100 మంది గ్రామ రెవెన్యూ అసిస్టెంట్లు పని చేస్తున్నారని జిల్లా వీఆర్యేల సంఘం ప్రధాన కార్యదర్శి గట్టు వెంకన్న ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. అర్హులైన వీఆర్యేలను ఖాళీగా ఉన్న వీఆర్వోలు పోస్టు, అటెండర్, వాచ్‌మేన్, రికార్డు అసిస్టెంటు పోస్టుల్లో నియమించడం ద్వారా ప్రమోషన్లు కల్పించి న్యాయం చేయాలని మొరపెట్టుకున్నారు. కార్యక్రమంలో ఐదు మండలాలు జామి, కొత్తవలస, లక్కవరపుకోట, శృంగవరపుకోట, వేపాడ మండలాల వీఆర్యేలు, వీఆర్యేల సంఘ నాయకులు పాల్గొన్నారు.


లలితకుమారికి వినతిపత్రం అందజేస్తున్న వీఆర్ఏల సంఘ నాయకులు

ఎస్సీ వర్గీకరణను తక్షణమే అమలు చేయాలి

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 21: దేశ అత్యున్నత న్యాయస్థానం ఈ నెల 1న ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా తీర్పు ఇచ్చిన నేపథ్యంలో 29 రాష్ట్ర ప్రభుత్వాలు తక్షణమే విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో అమలు చేయాలని ఎంఈఎఫ్ జాతీయ కార్యవర్గ సభ్యులు అరసాడ రవి కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం కంటోన్మెంట్‌లోని సంఘ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇన్నేళ్ళకు సుప్రీం కోర్టు ఎస్సీ వర్గీకరణకు తీర్పు ఇచ్చిన నేపథ్యంలో నేడు సీఎంగా చంద్రబాబు నాయుడు ఉం డడం మాదిగలు అదృష్టంగా భావిస్తున్నామన్నారు. పెంకి ఇజ్రాయిల్, మాదిక ఉద్యోగుల సమాఖ్య పోరాట సమితి ప్రతినిధులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రవికుమార్

5 నుంచి సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధం

విజయనగరం రింగురోడ్డు, ఆగస్టు 21: నగరంలో వచ్చే నెల 5 నుంచి సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధాన్ని అమల్లోకి తీసుకురానున్నా మని నగరపాలక సంస్థ కమిషనర్ నాయుడు అన్నారు. బుధవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్లాస్టిక్ విక్రయదారు లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్లాస్టి క్ డిస్ట్రిబ్యూటర్స్, హోల్‌సేల్స్, రిటైల్ వర్తకు లతో సమావేశమై, నగరంలో తక్షణం సంపూర్ణ ప్లాస్టిక్ నిషేధానికి నిర్ణయించడ మైనదన్నారు. అయితే ఇప్పటికే తన వద్ద ఉన్న ప్లాస్టిక్ వస్తువులు అమ్మకాలు అయినంత వరకూ కొంత సమయం కావాలని వర్తకులు కోరారని, ఇందుకోసం 15 రోజులు గడువు విధిస్తున్నట్లు కమిషనర్ తెలిపారు.

మంచి మనసుతోనే సేవా కార్యక్రమాలు

కొత్తవలస: సేవాకార్యక్రమాలు నిర్వహించాలంటే మంచి మనసు ఉండాలని శృంగవరపుకోట ఎమ్మెల్యే కోళ్లలలిత కుమారి అన్నారు. బుధవారం మండలంలోని మంగళపాలెం గ్రామంలో చేతన్ ఫౌండేషన్ ఆర్థిక సాయంతో గురుదేవ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో దివ్యాంగులకు కృత్రిమ అవయవాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎవ్వరికైనా గురుదేవ ట్రస్టు ద్వారా తమ సేవలు అందించే వీలుంటుందన్నారు. ఈ సందర్భంగా కోలాటంను ప్రోత్సహించడం కోసం మహిళలకు కోలాటం కర్రలు, చీరలు, భజనలు నేర్చుకునేవారికి భజన తాళాలు, చిరువ్యాపారాలు చేసుకునేందుకు రెండు కిరణాషాపులను అందించారు. ట్రస్టు చైర్మన్ రాపర్తి జగదీష్ బాబుతో పాటు తెలుగు దేశం పార్టీ నాయకులు కోళ్ల వెంకటరమణ, పిల్లా అప్పలరాజు, కోరుబిల్లి ఉపేంద్ర, పి.జగ్గారావు, పాల్గొన్నారు.

గుడ్ టచ్-బ్యాడ్ టచ్‌పై అవగాహన

బొబ్బిలి రూరల్: మండలంలోని పిరిడి గ్రామంలో బుధవారం స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా పోలీసు అమ్మడమ్మ ఆధ్వర్యంలో 8, 9, 10 తరగతి బాలికలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతి ఒక్కరూ చదువు పట్ల ఇష్టం పెంచుకోవాలని, సమస్యలు ఉంటే ఉపాధ్యాయులకు తెలియజేయాలన్నారు. ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ ఎన్ ప్రభావతి వ్యక్తిగత శుభ్రత, రక్తహీనతపై జాగ్రత్తలపై వివరించారు.

డీఎస్పీని కలిసిన బొబ్బిలి సీఐలు

బొబ్బిలి, ఆగస్టు 21: బొబ్బిలి అర్బన్, రూరల్ సీఐలుగా కటకం సతీష్ కుమార్, నారాయణరావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. అనంతరం డీఎస్పీ శ్రీనివాసరావును కలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఎస్పీ వారికి అనేక సూచనలిచ్చారు. గంజాయిని అరికట్టడమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని, చెక్ పోస్టులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు.

పార్టీకి ప్రచారం చేసిన వారికి గుర్తింపు

● సర్టిఫికెట్లు అందించిన అదితి

విజయనగరం రూరల్, ఆగస్టు 21: గత ఐదేళ్ల వైసీపీ అవినీతి, ప్రజా వ్యతిరేక పాలనపై టీడీపీ యాప్ ద్వారా పార్టీ శ్రేణులను, ప్రజలను చైతన్యవంతులు చేయడంలో ప్రతిభ కనబరిచిన విజయనగరం నియోజకవర్గ టీడీపీ నాయకులు, కార్యకర్తలకు రాష్ట్ర పార్టీ పంపిన ప్రత్యేక సర్టిఫికెట్‌లను విజయనగరం నియోజకవర్గ ఎమ్మెల్యే అదితి గజపతిరాజు బుధవారం పార్టీ కార్యాలయంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తాజాగా ఎన్డీఏ ప్రభుత్వం చేపడుతున్న వివిధ ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి ఈ యాప్ ద్వారా తీసుకువెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ప్రసాదుల ప్రసాద్, ఆల్తి బంగారుబాబు, మైలిపల్లి పైడిరాజు తదితరులు పాల్గొన్నారు.


టీడీపీ నాయకులకు సర్టిఫికెట్లు బహూకరిస్తున్న ఎమ్మెల్యే అదితి

మహిళలపై నేరాలు అరికడతాం

● ఎస్‌డీపీవో అంకిత సురానా

పార్వతీపురం, ఆగస్టు21(ఆంధ్రజ్యోతి)/బెలగాం/పార్వతీపురం టౌన్ : మహిళలపై జరుగుతున్న నేరాలను అరికడతామని పార్వతీపురం ఎస్‌డీపీవో అంకిత సురానా తెలిపారు. బుధవారం ఆమె బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నం నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చిన ఎస్‌డీపీవో తొలుత కలెక్టరేట్‌లో కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పట్టణ పోలీసు స్టేషన్‌ను సందర్శించి ఎస్ఐలు, సిబ్బందితో సమావేశమయ్యారు. శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేయాలని, మహిళా రక్షణ, డ్రగ్స్ నియంత్రణకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ఒడిశా నుంచి గంజాయి, నాటు సారా వంటివి అక్రమ రవాణా జరగకుండా చూడాలన్నారు. మాదక ద్రవ్యాలకు యువత బానిసలు కాకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. సైబర్ నేరాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

రామభద్రపురం: సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి భాస్కరరావు సూచించారు. మండల పరిధిలోని ఆరికతోట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిరోజూ ఆయా సబ్ సెంటర్ల పరిధిలోని గ్రామాలకు వెళ్లి అంటు రోగాలు, జ్వరాలపై ఆరా తీయాలని సూచించారు. అపారిశుధ్యాన్ని నిర్మూలించడంలో గ్రామ పంచాయతీలు భాగస్వామ్యం కావాలన్నారు. ఆసుపత్రిలో ప్రసవాలపై ఆరా తీశారు. ఆసుపత్రి పరిసరాలను శుభ్రంగా ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించడానికి సిబ్బంది తమవంతు కృషి చేయాలని సూచించారు. ఆసుపత్రి వైద్యాధికారి దీపక్, ఈవో మల్లికేశ్వరరావు, ఫార్మసిస్టు పొట్టా కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మాక్ గ్రామసభలు

రామభద్రపురం: మండల పరిధిలోని బూసాయవలస గ్రామంలో బుధవారం మాక్ గ్రామసభను నిర్వహించారు. ఎంపీడీవో రమామణి ఆధ్వర్యంలో వివిధ అంశాలపై ఉపాధిహామీ పథకం వేతనదారులకు, ప్రజలకు అవగాహన కల్పించారు.

రాజాం: పెనుబాక గ్రామంలో ఈనెల 23న జరగనున్న ఉపాధి హామీ పథకం గ్రామసభ నేపథ్యంలో బుధవారం మాక్ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రామంలో ఏ ఏ పనులు చేపట్టాలో ముందుగా తెలియజేయాలన్నారు. ఈ ఏడాది 100 రోజుల పనులు చేపట్టడానికి ప్రభుత్వం నిర్ణయించిందని వివరించారు. ఈ కార్యక్రమంలో ఏపీవో సాయిరాం తదితరులు పాల్గొన్నారు. ● **బొబ్బిలి రూరల్:** బొబ్బిలి మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో రవికుమార్ అధ్యక్షతన అన్ని మండలాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రవికుమార్ ఈ నెల 23న జరగబోవు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ గ్రామ సభలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ● **బాడంగి:** ఉపాధిగ్రామసభపై అందరూ అవగాహన కల్పించుకోవాలని ఎంపీడీవో ఆంజనేయులు కోరారు. బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇతర అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామసభ ఆవశ్యకతను ప్రజలకు వివరించాలన్నారు. గ్రామసభలో వివరించాల్సిన విషయాలను, వాటికి సంబంధించి పూర్తి సమాచారంను సిద్ధం చేసుకోవాలన్నారు.

పాలకొండ డీఎస్పీ బదిలీ

పాలకొండ: పాలకొండ డీఎస్పీ జీవీ కృష్ణారావుకు బదిలీ అయింది. ఈ మేరకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఆయన్ని అమరావతి పోలీస్ హెడ్‌క్వార్టర్స్‌కు పంపిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. అయితే ఆయన స్థానంలో పాలకొండ డీఎస్పీగా ఇంకా ఎవర్నీ నియమించలేదు.

గ్రామసభల్లో ప్రజలంతా పాల్గొనాలి

కలెక్టరేట్: జిల్లా వ్యాప్తంగా ఈనెల 23న అన్ని గ్రామాల్లో జరగనున్న గ్రామ సభలను విజయవంతం చేయాలని కలెక్టరు అంబేడ్కర్ తెలిపారు. బుధవారం సాయంత్రం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ గ్రామ సభల నిర్వహణపై కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టరు పాల్గొన్నారు. అనంతరం నోడల్ అధికారులతో కలెక్టరు మాట్లాడుతూ ఈనెల 23న జిల్లాలోని 775 గ్రామ పంచాయితీల్లో ఒక రోజున గ్రామ సభలు పూర్తి చేయాలని ఆదేశించారు. ప్రతి గ్రామసభకు ఒక ప్రత్యేకాధికారిని నియమించాలని చెప్పారు. కార్యక్రమంలో డీపీవో శ్రీధర్ రాజా, డీఆర్‌డీఏ పీడీ కల్యాణ చక్రవర్తి పాల్గొన్నారు.

ఎంఆర్ కళాశాలలో 'జనంలోకి మనం'

విజయనగరం రింగురోడ్డు: మహారాజా కళాశాల సెమినార్ హాల్లో బుధవారం తపాలాశాఖ, మహారాజా కళాశాల సంయుక్తంగా డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం ద్వారా 'జనంలోకి మనం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తపాలాశాఖ ఏఎస్పీ సుందరనాయుడు మాట్లాడుతూ, తపాలాశాఖలో పథకాలను వివరించారు. తపాలాశాఖలో పొదుపు బంగారు భవిష్యత్తుకి మార్గమన్నారు. కార్యక్రమంలో ఐపీబీపీ మేనేజరు సతీష్, పీఆర్‌ఓ మధు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

బొబ్బిలి రూరల్: మండలంలోని అలజంగి గ్రామంలోని సీబీఎం పాఠశాల విద్యార్థులకు సామాజికవేత్త పి సన్యాసినాయుడు బ్యాగ్‌లు, పుస్తకాలు ఉచితంగా పంపిణీ చేశారు. బుధవారం జరిగిన ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మోజేష్, కృష్ణదాస్ పాల్గొని సన్యాసినాయుడును అభినందించారు.

ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం

శృంగవరపుకోట రూరల్: మండలంలోని వీరనారాయణం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం హెచ్ఎం సూరిదేముడు, జీవశాస్త్ర ఉపాధ్యాయుడు అశోక్ రాజు ఆధ్వర్యంలో చైల్డ్‌ఫండ్ ఇండియా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రతినిధులు మాట్లాడుతూ వ్యాధిగ్రస్థులను అంటరాని వారిగా చూడకూడదని, వారికి నిరంతరం ధైర్యం చెప్పాలని సూచించారు.

గురుకుల పాఠశాల తనిఖీ

శృంగవరపుకోట రూరల్: మండలంలోని తాటిపూడి గురుకుల పాఠశాలను ఎంఈవో నరసింగరావు బుధవారం పరిశీలించారు. పాఠశాల ప్రిన్సిపాల్ సంధ్యతో మాట్లాడుతూ విద్యార్థులకు భోజనం ఆలస్యంగా పెట్టడానికి కారణాలు, జనరేటర్ మరమ్మతులు వంటి అంశాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎంఈవో మాట్లాడుతూ పత్రికల్లో వచ్చిన కథనాలపై జిల్లా విద్యా శాఖాధికారి నివేదిక ఇమ్మని ఆదేశించారని, దీనిపై విచా రణ జరిపామన్నారు. నివేదికను డీఈవోకు సమర్పిస్తామన్నారు.

తాత్కాలికంగా వంతెనపై నుంచి రాకపోకలకు అనుమతి

బొబ్బిలి రూరల్: మండలంలోని పారాది గ్రామం వద్ద మరమ్మతు పనులు పూర్తి చేసిన తాత్కాలిక వంతెనపై నుంచి అన్ని రకాల భారీవాహనాల రాకపోకలు జరపడానికి గురువారం నుంచి అనుమతి ఇచ్చారని బొబ్బిలి పోలీసులు తెలిపారు. పాత బ్రిడ్జి మీదుగా కేవలం లైట్ మోటార్ వెహికల్స్, ద్విచక్రవాహనాలు మాత్రమే రాకపోకలకు అనుమతి ఉంటుందని అటుగా ప్రయాణం చేసే వారు గమనించవలసిందిగా తెలియజేశారు.

దోమలతో అప్రమత్తం

రామభద్రపురం: దోమల బారినపడకుండా ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలని ఉపాధ్యాయుడు, రోటరీక్లబ్ జిల్లా చైర్మన్ జేసీ రాజు విద్యార్థులకు పిలుపునిచ్చారు. దోమల నివారణా దినం సందర్భంగా బుధవారం మండలంలోని నాయుడువలస గ్రామంలో ఇన్‌చార్జి హెచ్ఎం రెడ్డి వేణు దోమల నివారణ, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ప్రతి ఇంటిలో తప్పనిసరిగా దోమతెరలను వినియోగించి దోమల నుంచి రక్షణ కల్పించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు కృష్ణంనాయుడు, విద్యార్థులు పాల్గొన్నారు.

లెప్రసీ రోగులకు మందులు పంపిణీ

గంట్యాడ: కుష్టు వ్యాధి లక్షణాలు ఉంటే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని మహారాజా ఆసుపత్రికి చెందిన ఫిజియోథెరపిస్ట్ దినేష్ చెప్పారు. బుధవారం నరవ ఏఎంజీ కాలనీలో కుష్టు వ్యాధి లక్షణాలు ఉన్న వారికి ఉచితంగా ముందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది రామలక్ష్మి, దుర్గా ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు స్మార్ట్ మీటర్లు

శృంగవరపుకోట: ప్రభుత్వ కార్యాలయాల్లో బుధవారం విద్యుత్ స్మార్ట్ మీటర్లను అమర్చినట్లు ఏపీ ఈపీడీసీఎల్ సహాయ ఇంజినీర్ ఆర్.రవి తెలిపారు. ఉన్నతాధికారుల సూచనల మేరకు స్మార్ట్‌మీటర్లను కేటాయిస్తున్నామన్నారు. ఇప్పటికే పలు ప్రభుత్వ కార్యాలయాల్లో వీటిని బిగించామన్నారు.

ఇండియన్ పోలీసు మెడల్ గ్రహీతను అభినందించిన ఎస్పీ

విజయనగరం క్రైం: కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన ఇండియన్ పోలీసు మెడల్ గ్రహీత భోగా పురం ఏఎస్ఐ తిరుమలరాజు సూర్యనారాయణరాజును ఎస్పీ వకుల్ జిందాల్ జిల్లా పోలీసు కార్యాలయంలో అభినందించారు. రాష్ట్ర ప్రభుత్వం విజయవాడలో ఆగస్టు 15 న నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఇండియన్ పోలీసు మెడల్‌ను అందుకున్నారు. దీంతో సూర్యనారాయణరాజుకు ఎస్పీ శుభాకాంక్షలు తెలిపారు.

పాఠశాలలో టీకా కార్యక్రమం

బొబ్బిలి రూరల్: మండలంలోని బొడ్డవలస గ్రామం ఎంపీయూపీ పాఠశాలలో బుధవారం ఒకటో తరగతి విద్యార్థులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఏ ఎన్ఎం రాజేశ్వరి మాట్లాడుతూ టీకాలు సాధారణంగా బాల్యంలో తీవ్రమైన, తరచుగా వచ్చే ప్రాణాంతక వ్యాధు లనుండి రక్షించడానికి వేస్తారన్నారు. పిల్లలకు సమ యానుసారం టీకాలు వేయించాలన్నారు.

వసతిగృహాల్లో ఆకస్మిక తనిఖీలు

బొబ్బిలి: బొబ్బిలి పట్టణంలో స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతిగృహాలను జిల్లా ఐసీడీఎస్ పీడీ బి.శాంతకుమారి ఆధ్వర్యంలోని అధికారుల బృందం బుధవారం సాయంత్రం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనకాపల్లిలో కలుషిత ఆహారం కారణంగా చిన్నారులు మృతిచెందడం, పలువురి తీవ్ర అస్వస్థతకు గురైన నేపథ్యంలో ప్రభుత్వ ఆదేశాలమేరకు ఈ తనిఖీలు చేపట్టారు. తొలలుత హేండ్ ఇన్‌హేండ్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలలఅనాథాశ్రమాన్ని తనిఖీ చేశారు. అక్కడ అంతాసక్రమంగా ఉండడంతో అధికారులు సంతృప్తి వ్యక్తం చేశారు. బయటవారు వండి పంపించిన ఆహారపదార్థాలను ఎట్టిపరిస్థితుల్లో పిల్లలకు పెట్టరాదని నిర్వాహకులకు తెలిపారు.న పాతబొబ్బిలిలో గల ప్రభుత్వ బాలసదన్‌ను సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడారు, భోజన నాణ్యత, ఇతర సౌకర్యాలపై ఆరా తీశారు. ● స్థానిక ఐరిస్ స్కూలుకు చెందిన వసతిగృహాన్ని తనిఖీ చేశారు. రిజిస్ట్రేషన్ లేకుండా హాస్టల్ నిర్వహించరాదన్నారు. విద్యార్థులతో మాట్లాడి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. పీడీ వెంట స్థానిక ఐసీడీఎస్ పీవో జె.విజయలక్ష్మి, సూపర్‌వైజర్ అరుణ, నిర్మల, ఇతర సిబ్బంది పాల్గొన్నారు. ● **తెర్లాం:** మండలంలోని గంగన్నపాడు ఎంపీపీ పాఠశాలను ఎంఈవో త్రినాథరావు బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల పరిసరాలను, మరుగుదొడ్లు, రన్నింగ్ వాటర్, తాగునీటి సదుపాయా న్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థుల నైపుణ్యాలను పరిశీలించారు. అలాగే సిలబస్ పూర్తి, వర్కు బుక్ కరెక్షన్, పాఠశాల రికార్డులను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథక నిర్వహణను తనిఖీ చేసి ని ర్వాహకులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఉపాధ్యాయులు ఉన్నారు.

జామి: మండలంలో ఉన్న ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల్లో ఉన్న సౌకర్యాలపై నివేదికలు పంపాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించండంతో మండలంలోని భీమసింగి బాలాజీ జూనియర్ కళాశాలతో పాటు పలు పాఠశాలలు, అంగన్వాడీకేంద్రాలను తహసీల్దార్ కృష్ణలత బుధవారం పరిశీలించారు. వసతి, ఆహారం వంటివి తనిఖీ చేశారు. కుల ధ్రువీకరణ పత్రాలకు చేసుకున్న దరఖాస్తులు తిరస్కరణకు గురవడంతో సంబంధిత కుటుంబాల వద్దకు వెళ్లి తిరస్కరణకు గల కారణాలను పరిశీలించి, వీటిపై నివేదికను కలెక్టర్‌కు అందిస్తామని తెలిపారు.


ఎస్‌కోట రూరల్: భీమసింగిలోని ఓ కళాశాలను పరిశీలిస్తున్న తహసీల్దార్ కృష్ణలత

ఎక్స్‌కవేటర్ తగిలి వ్యక్తి మృతి

భోగాపురం, ఆగస్టు 21: ఎక్స్‌కవేటర్ తగిలి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి సీఐ ఎన్వీ ప్రభాకరరావు బుధవారం తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలం తూడెం పంచాయతీ గాలిపేటకు చెందిన బోరబంగారి(54)కి ఇద్దరు కుమారులు. పెద్దకుమారుడు బోర అప్పలనర్సయ్యకు జేసీబీ ఉంది. దీనిని అద్దెకు తిప్పుతూ కుటుంబం జీవనం సాగిస్తోంది. ఈ క్రమంలో బసవపాలెం గ్రామంలో రీసు అప్పారావు ఇంటిని కూల్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. అనంతరం జేసీబీతో పనులు నిర్వహిస్తుండగా మంగళవారం సాయంత్రం పగిలిన స్లాబ్‌కి ఉన్న ఇనుప ఊచలను తండ్రి బోరబంగారి వేరుచేస్తున్నాడు. అదే సమయంలో గోడ పగలుకొడుతున్న జేసీబీ బలంగా బంగారికి తగలడంతో తలకు బలమైన గాయమైంది. దీంతో వెంటనే చికిత్స నిమిత్తం విజయనగరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య తోటమ్మ ఉంది. దీనిపై మృతుడు రెండో కుమారుడు బోర సురేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.


బోరబంగారి (ఫైల్)

విద్యుదాఘాతంతో ఒకరు..

గజపతినగరం, ఆగస్టు 21: విద్యుదాఘాతానికి గురై వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఎస్సై లక్ష్మణరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని కెంగువ గ్రామానికి చెందిన యిజ్జిరోతు రామునాయుడు(45) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో బుధవారం పొలంలో నీరు తడి పెట్టేందుకు బోరు వద్దకు వెళ్లి మోటారు ఆన్ చేయగా షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందారు. మృతుడికి భార్య గౌరి, పిల్లలు లక్ష్మి, భాస్కరరావు ఉన్నారు. ఇంటి యజమాని మృతిచెందడంతో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. భార్య గౌరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. శవపంచనామ నిమిత్తం మృతదేహన్ని జిల్లా కేంద్రానికి తరలించారు.

గంజాయి విక్రయిస్తున్న వ్యక్తులు అరెస్టు

విజయనగరం క్రైం, ఆగస్టు 21: విజయనగరం వన్‌టౌన్ పోలీసు స్టేషన్ పరిధిలోని సీఎంఆర్ జంక్షన్ సమీపంలో ఇద్దరు వ్యక్తులు అక్రమంగా గంజాయి విక్రయిస్తున్నట్లు వన్‌టౌన్ పోలీసులకు సమాచారం వచ్చింది. దీంతో సీఐ శ్రీనివాస్, సిబ్బంది ఘటన స్థలానికి చేరుకుని గాజులరేగకు చెందిన డి జ్యోతిరామ్, ఒడిసా రాష్ట్రం రాయగడకు చెందిన సునబూడి అనురాధను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నాలుగు కిలోల గంజాయి, పొగాకు కలిపిన మెటీరియల్‌ను స్వాధీనం చేసుకున్నట్టు సీఐ శ్రీనివాస్ తెలిపారు. జ్యోతిరామ్‌పై 25 కేసులు ఉన్నాయని, ఒడి సాకు చెందిన అనురాధ వద్ద గంజాయిని తక్కువ ధరకు కొనుగోలు చేసి చిన్న, చి న్న పొట్లాలు కట్టి విజయనగరం పరిసర ప్రాంతాల్లో అమ్ముతున్నట్టు విచారణలో తెలిపారు. వీరిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్టు సీఐ తెలిపారు.


నిందితులతో సీఐ శ్రీనివాస్

శ్రీరాంపురంలో భారీ చోరీ

● 20 తులాల బంగారం, నగదు అపహరణ

లక్కవరపుకోట, ఆగస్టు 21: ఓ ఇంట్లో చోరీ జరిగి బంగారం, నగదు అపహరించుకుపోయిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి ఎస్ఐ ఆర్.గోపాలరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని శ్రీరాంపురంలో నివాసం ఉంటున్న భూమిరెడ్డి ఎర్నాయుడు ఎప్పటిలా తన కుటుంబం సభ్యులతో కలిసి బుధవారం ఉదయం ఇంటి నుంచి బయలుదేరి సుమారు 10-30 సమయంలో పొలానికి వెళ్లారు. భార్య దేవి పొలం పనులు ముగించుకుని మధ్యాహ్నం 12-30 సమయానికి ఇంటికి వచ్చి తలుపు తీయగా ఇంటిలో ఉన్న కిటికీలు, తలుపులు, బీరువా తెరిచి ఉన్నాయని గమనించారు. వెళ్లి చూడగా వరలక్ష్మి వ్రతానికి తెచ్చుకున్న 20 తులాల బంగారు ఆభరణాలు, 20 వేల నగదు చోరీకి గురైనట్లు గుర్తించారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని సీఐ రవికుమార్ ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నారు. విజయనగరం క్లూస్ టీం సీఐ మురళీ, సిబ్బంది వేలిముద్రలు సేకరించారు. ఘటనపై కే సు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ గోపాలరావు తెలిపారు.


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

విజయనగరంలో నాలుగు చోట్ల..

విజయనగరం క్రైం: నగరంలోని తోటపాలెం వైఎస్సార్ నగర్‌లో మంగళవారం రాత్రి నాలుగిళ్లల్లో దొంగతనం జరిగినట్టు సీఐ ఎస్ శ్రీనివాస్ తెలిపారు. నాలుగిళ్లల్లో కలిసి మూడు తులాలు బంగారు ఆభరనాలు, వెండి వస్తువులతో పాటు 1 లక్ష 40 వేలు నగదు దొంగతనం అయినట్టు తెలిపారు. సంఘటన స్థలా న్ని క్లూస్ టీంతో కలిసి పరిశీలించామని త్వరలో దొంగతనాలకు పాల్పడిన నిందితులను అదుపులోకి తీసుకుంటామని సీఐ తెలిపారు.

మద్యం సీసాల ధ్వంసం

శృంగవరపుకోట: శృంగవరపుకోట పోలీస్‌స్టేషన్ పరిధిలో ఇటీవల పట్టుబడ్డ 633 మద్యం సీసాలను బుధవారం ధ్వంసం చేశారు. ఈ స్టేషన్ పరిధిలో 43 కేసుల్లో వీటిని స్వాధీనపరుచుకున్నారు. ఎన్‌ఫోర్స్‌మెంటు సహాయ సూపరింటెండెంట్ డీవీజీ రాజు పాల్గొన్నారు.

కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

● దీర్ఘకాలిక సమస్య పరిష్కరించిన విద్యుత్‌శాఖ ఏఈ

శృంగవరపుకోట రూరల్: మండలంలోని ముషిడిపల్లి పంచాయతీలోని గురుకుల పాఠశాల, కళాశాలలకు దీర్ఘకాలికంగా వేధిస్తున్న దీర్ఘకాలిక విద్యుత్‌సమస్యకు మండల విద్యుత్‌శాఖ ఏఈ రుద్రరవికుమార్ పూర్తిస్థాయిలో పరిష్కరించారు. రెండురోజుల క్రితం ఈ పాఠశాల, కళాశాలలకు సంబంధించిన ట్రాన్స్‌పార్మర్ పాడవడంతో ఇందులో ఉన్న వందలాదిమంది విద్యార్థులకు భోజనాలు ఆలస్యంగా పెట్టడంతో పాటు వారు చదువుకోవడానికి ఇబ్బంది పడ్డారు. దీంతో మంగళవారం రాత్రి పదకొండు గంటల సమయంలో మండలంలో ఉన్న విద్యుత్‌శాఖ సిబ్బందిని తీసుకెళ్లి కాలిపోయిన ట్రాన్స్‌పార్మర్‌ను తొలగించి హుటాహుటీన కొత్తట్రాన్స్‌పార్మర్ తెప్పించి అర్ధరాత్రి ఒంటిగంట సమయంలో విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్స్ సహకారంతో ఈప్రాంతంలో ఉన్న తుప్పలు, డొంకలు, విద్యుత్‌వైర్లకు అనుకుని ఉన్న చెట్లు తీయించారు. దీంతో ఈ సమస్యకు చెక్‌పడినట్లయింది.

నిమ్మలపాడులో 3,4,5 తరగతులు పునరుద్ధరించాలి

బొబ్బిలి రూరల్: మండలంలోని గిరిజన గ్రామమైన చిత్రకోటబొడ్డవలస పంచాయతీ, నిమ్మలపాడు ప్రభుత్వ పాఠశాలలో 3, 4, 5 తరగతులను పునరుద్ధరించాలని గ్రామస్థులు ఇచ్చిన వినతి పత్రాన్ని యూటీఎఫ్ రాష్ట్ర మహిళా సభ్యురాలు విజయగౌరి, మండల విద్యాశాఖాధికారికి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఈ మధ్యనే ఆ గ్రామాన్ని సందర్శించానని, ఆ గ్రామంలో 1, 2 తరగతులు మాత్రమే ఉన్నాయనీ, 3, 4, 5 తరగతులు లేకపోవడం వలన సాలూరు మండలం తాడిలోవ గ్రామానికి చిన్నపిల్లలు నడుచుకుంటూ 3 కి.మీ దూరం వెళ్లవలసి వస్తుందనీ, దీనితో పిల్లలకు రక్షణ లేకుండా పోతుందనీ, తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారని తెలిపారు. దీనిపై మండల విద్యాశాఖాధికారి చల్ల లక్ష్మణరావు సానుకూలంగా స్పందించి ఈ సమస్యను జిల్లా విద్యాశాఖాధికారి దృష్టికి తీసుకెళ్లి తగిన చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.

సైబర్ నేరాలపై అవగాహన కల్పించండి

కొత్తవలస: గ్రామ సచివాలయాలలో పనిచేస్తున్న మహిళా పోలీసులు సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని కొత్తవలస సీఐ షణ్ముకరావు సూచించారు. బుధవారం కొత్తవలస పోలీసు స్టేషన్‌లో మండల సచివాలయాల పోలీసులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో చాలామందికి సైబర్ మోసాలపై సరైన అవగాహన లేక తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. సైబర్ నేరగాళ్లంతా వివిధ రకాలుగా మోసాలు చేయడానికి ప్రయత్నాలు చేస్తుంటారని, వాటి గురించి గ్రామీణ ప్రాంత ప్రజలకు తెలియజేసి జాగ్రత్త పరచాలన్నారు.

కట్టెలతో వంటచేస్తే చర్యలు

మెంటాడ: పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులు గ్యాస్ తోనే వంట చేయాలని ఎంఈఓ వర్మ స్పష్టం చేశారు. ఈ నెల 18న 'కట్టెలకో దండం..వంట చేయలేం' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన వార్తకు డీఈఓ ప్రేమ్ కుమార్ స్పందించారు. పూర్తి వివరాలు అందజేయాలని ఎంఈఓను ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఆయన అందరు హెడ్మాస్టర్లకు ఉత్తర్వులు జారీ చేశారు. గ్యాస్ కాకుండా కట్టెలు వినియోగిస్తే చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇలా ఉండగా.. ఎంఈఓ సూచనల మేరకు ఫీల్డ్ విజిట్‌కు వెళ్లిన స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్లకు వింత పరిస్థితి ఎదురవుతోంది. మెనూ ప్రకారం నిత్యం మూడు రకాల వంటలు ఒక్క సిలిండర్‌తో చేయడంతో రెండు మూడు రోజులకే అయిపోతుందని, తిరిగి గ్యాస్ సరఫరా అయ్యేవరకు కట్టెలే దిక్కవుతున్నాయని వారు కుండబద్దలు కొట్టినట్లు చెప్పారు. చైర్మన్లు ఇదే విషయాన్ని ఎంఈఓకు స్పష్టం చేస్తున్నారు. దీనిపై డీఈఓకు నివేదిక అందజేస్తామని చెప్పారు.

బంద్ ప్రశాంతం

ఎస్సీ వర్గీకరణపై సుప్రీం తీర్పునకు వ్యతిరేకంగా దళిత బహుజన జేఏసీ ఆధ్వర్యంలో బుధవారం బంద్ పాటించారు. వివిధ ప్రాంతాల్లో మానవహారాలు నిర్వహించారు.

-ఆంధ్రజ్యోతి నెట్ వర్క్



రాజాం: అంబేద్కర్ కూడలి వద్ద మానవహారం నిర్వహిస్తున్న దృశ్యం



బొబ్బిలి: ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలిలో దళితుల మానవహారం



వంగర: బస్సులు నిలుపుదల చేసి ఆందోళన చేస్తున్న నాయకులు



గరివిడి: అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న దృశ్యం



ఎస్.కోట: ధర్మవరంలో దుకాణాలు మూయిస్తున్న దృశ్యం



గుర్ల: బంద్‌లో పాల్గొన్న జేఏసీ నాయకులు



తెర్లాం: నిరసన తెలుపుతున్న దళిత నాయకులు



వేపాడ: వల్లంపూడిలో ర్యాలీ నిర్వహిస్తున్న దళిత సంఘాల నాయకులు

అంగన్‌వాడీ సిబ్బందికి మెమోలు

గజపతినగరం: విధుల్లో అలసత్వం వహించిన అంగన్‌వాడీ కార్యకర్త, ఆయాలకు మెమోలు జారీ చేసినట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శకుంతల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తుమ్మికాపల్లి అంగన్‌వాడీ కార్యకర్త సుభాషిణి, ఆయా రాధలు ఈ నెల 14న మధ్యాహ్నం అంగన్‌వాడీ కేంద్రం మూసివేసి ఉండడంతో గ్రామస్తులు అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పరిశీలించగా.. విధులు ఎగ్గొట్టినట్టు తేలిందని సూపర్‌వైజర్ తెలిపారు. ఈమేరకు ఇద్దరికీ మెమోలు జారీ చేశామని తెలిపారు. ఇదిలా ఉండగా గత వారంలో తాము రాజకీయ వేధింపులకు గురవుతున్నామని గజపతినగరం, రామన్నపేట, రంగుపురం, కెంగువ అంగన్‌వాడీలు మంత్రిని కలిసి వినతిపత్రం అందజేశారు. తాజాగా వారంతా తమకు రాజకీయ నాయకుల నుంచి ఎటువంటి ఇబ్బందులు లేవని లిఖిత పూర్వకంగా ఇచ్చారని తెలిపారు.

సేంద్రియ ఎరువులపై దృష్టి సారించాలి

గజపతినగరం: రైతులు సేంద్రియ ఎరువులపై దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వి.టి.రామారావు అన్నారు. కొనిస గ్రామంలో శీరం రెడ్డి రాంకుమార్ వ్యవసాయ క్షేత్రంలో డ్రోన్‌తో ఎరువులు, పురుగు మందులు చల్లడంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏడీఏ కె. మహరాజన్, ఏవో ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కంటి వైద్య శిబిరంలో 160 మందికి సేవలు

గుర్ల: చింతలపేట గ్రామంలో వైద్యులు చిట్టి రామారావు, టీడీపీ నాయకులు బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో 160 మందికి కంటి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ ప్రధాన కార్యదర్శి పిల్లా అప్పలనాయుడు, మాజీ సర్పంచ్ చింతల్లి సత్యం, మాజీ ఎంపీటీసీ పిల్లా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీవోగా రవికుమార్

సంతకవిటి: స్థానిక ఎంపీడీఓగా జి.వి.రవికుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన ఎం.పి.డి.ఒ. జి.పైడితల్లి బదిలీపై గరుగుబిల్లి వెళ్లారు. ఆ స్థానంలో జి.వి.రవికుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తానని తెలిపారు.

పిల్లలను నిర్లక్ష్యం చేస్తే చర్యలు తప్పవు

చీపురుపల్లి: స్వచ్ఛంద సంస్థలు నడుపుతున్న ట్రస్టులు, ఇతర సంస్థల్లో పిల్లల బాగోగులు, ఆహారం తదితర విషయాల పట్ల నిర్లక్ష్యం వహిస్తే యాజమాన్యాలపై చర్యలు తీసుకుంటామని స్త్రీ ,శిశు సంక్షేమ శాఖకు చెందిన జిల్లా నోడల్ అధికారి విజయకుమారి స్పష్టం చేశారు. చీపురుపల్లి పట్టణంలో ఓ క్రైస్తవ సంస్థ ఆధ్వర్యంలో నడుస్తున్న బాలబాలికల గృహాన్ని ఆమె బుధవారం తనిఖీ చేశారు. వసతి గృహంలో పిల్లలకు ఇస్తున్న ఆహారాన్ని తనిఖీ చేశారు. మరుగుదొడ్లు, ఇతర సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ పాడైపోయిన, నిల్వ ఉంచిన, దాతలిచ్చిన ఆహార పదార్థాలను పిల్లలకు వడ్డించకూడదన్నారు. క్రమం తప్పకుండా విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలు చేయించాలని సూచించారు. ఆమె వెంట ఇన్‌చార్జి సీడీపీఓ జె.పైడిమంగమ్మ, ఎల్‌సీపీఓ కె. విజయలక్ష్మి, ఓఆర్‌లు కె.అప్పారావు, అంగన్‌వాడీ కార్యకర్త బొడ్డేపల్లి రాము పాల్గొన్నారు.

పవర్ లిఫ్టింగ్‌లో రేణుకకు బంగారు పతకం

చీపురుపల్లి: పట్టణానికి చెందిన సాకేటి రేణుక కల్యాణి జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో బంగారు పతకం సాధించింది. ఈ నెల 18న విశాఖలో 60వ విశాఖ పవర్ లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ పోటీలు జరిగాయి. ఈ పోటీల్లో పాల్గొన్న రేణుక కల్యాణి 83 కిలోల మహిళల జూనియర్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనబరచి బంగారు పతకాన్ని కైవసం చేసుకుంది. అదే జిమ్‌లో శిక్షణ తీసుకున్న కె.శ్రీకర్ 93 కిలోల పురుషుల సీనియర్ విభాగంలో రజత పతకాన్ని సాధించారు. బంగారు పతకాన్ని పొందిన రేణుక కల్యాణిని కోచ్ దుర్గాప్రసాద్, జిమ్ సభ్యులు, మిత్రులు అభినందించారు.



పసిడి, రజత పతకాలు పొందిన రేణుక, శ్రీకర్

ఆధునిక పద్ధతులతో అధిక దిగుబడులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏవో అనూరాధ

దత్తిరాజేరు: ఆధునిక సాగు పద్ధతులతో రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చునని వ్యవసాయ అధికారి అనూరాధ తెలిపారు. దాసరిపేట గ్రామంలో రైతులకు బుధవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. 30 మంది రైతులతో 25 ఎకరాల విస్తీర్ణంలో 2 ఎకరాల అధ్యయన క్షేత్రంలో పొలంబడి నిర్వహించనున్నట్టు తెలిపారు. గజపతినగరం మండల తెలుగునాడు ఎఫ్‌పీవో సీఈవో దుర్గాప్రసాద్, వీఏఏ గణపతి, రైతులు పాల్గొన్నారు.

గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహించండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ గిరిబాల

నెల్లిమర్ల: ఉపాధి హామీ పథకంలో 2024-25 సంవత్సరంలో చేపట్టనున్న పనుల గుర్తింపు కోసం ఈ నెల 23న అన్ని గ్రామాల్లో తలపెట్టిన గ్రామసభలను సమర్థవంతంగా నిర్వహించాలని ఎంపీడీఓ జి.గిరిబాల సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం ఉపాధి సిబ్బంది, వివిధ శాఖల అధికారులతో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీఓ గిరిబాల మాట్లాడుతూ గ్రామసభల్లో ప్రజా ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని పనులను గుర్తించాలని సూచించారు. ఈ సమావేశంలో ఉపాధి ఏపీఓ అరుణకుమారి, ఈసీ కార్తీక్, ఈవోపీఆర్‌డీ కె.సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాల రవాణాపై నిఘా: డీఐజీ గోపీనాథ్ జెట్టి

భోగాపురం: జాతీయ రహదారిపై గంజాయి తదితర మత్తు పదార్థాల రవాణా, వినియోగం నిరోధంపై ప్రత్యేక దృష్టి సారించాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి సూచించారు. భోగాపురం పోలీస్ స్టేషన్‌ను ఆయన బుధవారం సందర్శించారు. స్టేషన్‌లో రికార్డులు పరిశీలించి సిబ్బంది వివరాలు తెలుసు కున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గంజాయి రవాణా నిరోధంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో విజయనగరం డీఎస్పీ ఆర్.గోవిందరావు, సీఐ ఎన్వీ ప్రభాకరరావు, ఎస్ఐ పి.సూర్యకుమారి, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



పోలీస్ స్టేషన్ వద్ద సిబ్బందితో చర్చిస్తున్న డిఐజీ గోపీనాథ్ జెట్టి

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

భోగాపురం: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన తోటి ఉద్యోగి కుటుంబాన్ని ఆదుకోవడానికి యూనియన్ సభ్యులు ముందుకు వచ్చారు. ఆ కుటుంబానికి బుధవారం రూ.2 లక్షలు ఆర్థిక సాయం అందజేశారు. మోదవలసకు చెందిన ఎం.పైడిశెట్టి నాతవలస టోల్‌ప్లాజాలో పని చేస్తున్నాడు. ఇటీవల విధులకు వెళ్లే సమయంలో రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పైడిశెట్టిది పేద కుటుంబం కావడంతో టోల్‌ప్లాజా యూనియన్ నాయకులు చింతపల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సభ్యులందరూ వారి ఒక రోజు వేతనాన్ని మృతుడి భార్య ఎం.దివ్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో టోల్‌ప్లాజా సిబ్బంది పాల్గొన్నారు.

వేదికపై ఎంపీపీ భర్త ఎందుకు?

- అధికారులను నిలదీసిన టీడీపీ సర్పంచ్
- వాడీవేడిగా మండల సమావేశం

గజపతినగరం: 'మండల పరిషత్ సమావేశంలో ఎం.పి.పి. భర్తను వేదికపై ఏ హోదాలో కూర్చోబెడతారు? అందుకు సమాధానం చెప్పాలని రామన్నపేట సర్పంచ్ రుంకాణ అరుణ అధికారులను నిలదీశారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎం.పి.పి. బెల్లాన జ్ఞానదీపిక అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. సమావేశం సాగుతుండగా రామన్నపేట సర్పంచ్ రుంకాణ అరుణ హాజరయ్యారు. అప్పటికే వేదికపైకి ఎం.పి.పి. భర్త, తుమ్మికాపల్లి సర్పంచ్ బెల్లాన త్రినాథరావును అధికారులు ఆహ్వానించారు. దీంతో గ్రామ సర్పంచ్ రుంకాణ అరుణ స్పందిస్తూ వేదిక పైకి గ్రామ సర్పంచును ఎలా ఆహ్వానించారని ఎం.పి.డి.ఒ. కిషోర్ కుమార్‌ను నిలదీశారు. ప్రోటోకాల్ ఉల్లంఘించిన అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దీంతో వైసీపీకి చెందిన మదుపాడ, రంగుపురం, సర్పంచ్‌లు పైడిపినాయుడు, లక్ష్మణ, కొత్తబగ్గాం ఎం.పి.టి.సి. సభ్యురాలు సారికి భారతి ఆమెకు అడ్డుతగిలారు. గత మూడేళ్లుగా ఎం.పి.పి. భర్త సమావేశానికి వస్తున్నారని.. అప్పుడు లేని ప్రోటోకాల్ ఇప్పుడు గుర్తుకు రావడం వెనుక వ్యక్తిగత కక్ష ఉందని ఎదురు తిరిగారు. దీంతో వీరి మధ్య మాటా మాటా పెరిగి వాగ్వాదానికి దారి తీసింది. పరస్పరం వ్యక్తి గత ఆరోపణలకు దిగారు. తాను అధికారులను ప్రశ్నిస్తే వైసీపీ నాయకులు వత్తాసు పలకడం సరికాదన్నారు. ఎంపీపీ భర్తతో పాటు తాను కూడా సర్పంచునేనని.. వేదికపైకి తనను ఆహ్వానించాలని పట్టుబట్టారు. దీంతో ఎంపీడీఓ కలుగజేసుకొని సభ సవ్యంగా సాగేందుకు అందరూ సహకరించాలని కోరారు. సుమారు అరగంట పాటు సమావేశం రసాభాసగా మారింది. ఎం.పి.పి. భర్త సభావేదిక నుంచి కిందకు దిగి వెళ్లిపోయారు. అనంతరం ఎం.పి.పి.బెల్లాన జ్ఞానదీపిక యథావిధిగా సభను కొనసాగించారు. ఈ సమావేశంలో జెడ్పీటీసీ గార తవుడు, వైస్ ఎంపీపీ కర్రి శ్రీదేవి, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



టీడీపీ, వైసీపీ నాయకుల వాగ్వాదం

మందులతో ఎయిడ్స్ నివారణ

గరివిడి: ఎయిడ్స్ పట్ల భయాందోళనకు గురికాకుండా మందులు వాడి నివారించవచ్చని గరివిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి డా.రాజ్యలక్ష్మి అన్నారు. స్థానిక అవంతీస్ సెయింట్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో ఎన్‌ఎస్‌ఓ ఆర్గనైజేషన్, ఎల్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్స్‌పాల్ వి.జాషువా జయప్రసాద్, సీహెచ్‌ఓ సత్యం నాయుడు, ఐసీటీసీ కౌన్సిలర్ శ్రీదేవి, వైస్ ప్రిన్స్‌పాల్ బి.వెంకటరమణం, పరిపాలనాధికారి జి.అనిల్‌కుమార్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

● **గుర్ల:** పెనుబర్తి గ్రామంలో హెచ్‌ఐవీ, ఎయిడ్స్‌పై బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. చైల్డ్ ఫండ్ ఇండియా ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ సన్యాసినాయుడు, గుషిడి సూర్యారావు, మండల అప్పలనాయుడు, ఏఎన్‌ఎం కుమారి, ఆశావర్కర్‌లు, లింక్ వర్కర్లు కుమారి, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

బొండపల్లి ఎస్ఐగా మహేష్

బొండపల్లి: బొండపల్లి ఎస్ఐగా యు.మహేష్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకు ఇక్కడ పనిచేసిన కె.లక్ష్మణరావు గజపతినగరానికి బదిలీపై వెళ్లారు. అక్కడ విధులు నిర్వహించిన యు.మహేష్ బదిలీపై బొండపల్లి వచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఐ మహేష్ మాట్లాడుతూ గంజాయి అక్రమ రవాణా నిరోధంపై ప్రత్యేక దృష్టి పెడతామని చెప్పారు.

● **గజపతినగరం:** స్థానిక పోలీసు స్టేషన్‌లో ఎస్ఐగా కసిరెడ్డి లక్ష్మణరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. బొండపల్లి నుంచి ఆయన ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎస్ఐ యు. మహేష్ బొండపల్లి స్టేషన్‌కు బదిలీపై వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్ఐ లక్ష్మణరావు మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని తెలిపారు.

విద్యార్థులే స్వీపర్లు

- ఇదీ ఆశ్రమ పాఠశాల పరిస్థితి



హాస్టల్ వరండాలో ఊడుస్తున్న విద్యార్థి

మెంటాడ: ఈ చిత్రంలో చీపురు పట్టుకొని ఊడుస్తున్నది ఆంధ్ర ఆశ్రమ పాఠశాల విద్యార్థి. బుధవారం ఈ దృశ్యం కనిపించింది. ఉమ్మడి జిల్లాలో ఆశ్రమ విద్యార్థులు నిత్యం చేస్తున్న పని ఇదే. తాము బస చేస్తున్న గదులు, వరండాలను రోజూ శుభ్రం చేస్తుండాలి. అప్పుడప్పుడు గదులు కడగాలి. ఉమ్మడి జిల్లాలో ఆశ్రమ పాఠశాలు 72, కళాశాల వసతి గృహాలు 22 ఉన్నాయి. ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ (పాఠశాల) వసతి గృహాలలో విద్యార్థులే స్వీపర్ల అవతారమెత్తు తున్నారు. ఈ పాఠశాలలకు స్వీపర్ పోస్టులు లేవు. కేవలం మరుగుదొడ్ల శుభ్రం చేయడానికి సిబ్బందిని నియమించడంతో విద్యార్థులే స్వీపర్ల పాత్ర పోషించాల్సి వస్తోంది. రోజుకు కొందరు విద్యార్థుల వంతున ఈ బాధ్యతను తీసుకుంటున్నారు. విద్యార్థులతో ఈ పనులు చేయించడంపై తల్లిదండ్రులు, ప్రజలు మండిపడుతున్నారు. ముగ్గురు నలుగురు విద్యార్థులున్న ప్రాథమిక పాఠశాలలకు స్వీపర్లను నియమిస్తున్నారు. పదులు సంఖ్యలోనున్న ఆశ్రమ గృహాలకు స్వీపర్‌ను నియమించకపోవడం శోచనీయమని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. స్వీపర్లను నియమించాలని ఉప ముఖ్యమంత్రిగా ఉన్న రాజన్నదొర దృష్టికి అనేక పర్యాయాలు సమస్యను తీసుకువెళ్లినా పట్టించుకోలేదు. ఇప్పుడు అదే జిల్లాకు చెందిన గుమ్మడి సంధ్యారాణి గిరిజన, శిశు సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్నారు. స్వీపర్ల నియామకానికి మంత్రి చొరవ చూపాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

అయ్యప్ప ఆలయానికి విరాళం

చీపురుపల్లి: చీపురుపల్లిలో నిర్మాణంలో ఉన్న అయ్యప్ప ఆలయం కోసం రేగిడిపేటకు చెందిన ఎలకల వెంకటసూరి బాబు, దేవి దంపతులు రూ.51,003 విరాళంగా ఇచ్చారు. ఈ మొత్తాన్ని ఆలయ నిర్మాణ కమిటీ ప్రతినిధులు ఎస్వీజీ శ్రీనివాసరావు, అప్పికొండ ఆదిబాబు, దిలీప్‌కుమార్ ధనూకా, ఒమ్మి రమేష్, పీతల మురళి తదితరులకు అందజేశారు.

వీఆర్వోపై ఫిర్యాదు

బొండపల్లి: బొండపల్లి, కనిమెరక, గిట్టుపల్లి, బోడసింగిపేట, ఇసుగంటి వెంకన్న అగ్రహారం, కుమ్మరిగుంట, ముత్యాలు అగ్రహారం వీర్వోగా పనిచేస్తూ అనేక అక్రమాలకు పాల్పడిన డి.రవిపై చర్యలు తీసుకోవాలని కనిమెరక గ్రామానికి చెందిన జైభీమ్ అంబేద్కర్ యువజన సంఘ అధ్యక్షులు బగ్గ ఎర్రయ్య బుధవారం తహసీల్దార్ డి.రాజేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. పట్టాదారు పాసు పుస్తకాలు, టైటిల్ డీడ్స్ ఇప్పిస్తామని, డి.పట్టా భూములకు ఫ్రీహోల్డ్ పట్టాలు ఇప్పిస్తామని రైతుల నుంచి లక్షలాది రూపాయలు లంచాలుగా తీసుకొని అన్యాయం చేశారని ఎర్రయ్య ఆరోపించారు. వీఆర్వో డి.రవిపై సత్వరమే విచారణ చేపట్టాలని తహసీల్దార్‌ను కోరినట్టు ఎర్రయ్య తెలిపారు.

వైద్య శాస్త్రంలో రేడియాలజీ పాత్ర కీలకం

నెల్లిమర్ల: వైద్య శాస్త్రంలో రేడియాలజీ, ఆప్టోమెట్రిలు అత్యంత ప్రాముఖ్యతగలవని సెంచూరియన్ పూర్వ విద్యార్థులు వివరించారు. సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో బుధవారం వర్చువల్ సదస్సు జరిగింది. ఈ సదస్సులో లండన్‌లోని డూండీ విశ్వవిద్యాలయంలో పోస్టుగ్రాడ్యుయేషన్ చదువుతున్న సెం పూర్వ విద్యార్థి చిలకపాటి భరత్ కల్యాణ్ వర్చువల్‌గా రేడియోగ్రఫీ ఎ. విజన్ ఫర్ ఇ ఫ్యూచర్ అనే అంశంపై ప్రసంగించారు. మరో పూర్వ విద్యార్థి గుంజు భవాని ఆప్టోమెట్రీ గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో డీన్ ప్రొఫెసర్ ఎంఎల్ఎస్ ఆచార్యులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అతిథి అధ్యాపక పోస్టులకు దరఖాస్తులు

గజపతినగరం: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఖాళీగా ఉన్న పోస్టులను అతిథి (తాత్కాలిక ప్రాతిపదికన) అధ్యాపకులతో భర్తీ చేసేందుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రావాడ సత్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కంప్యూటర్ సైన్స్, బోటనీ, పొలిటికల్ సైన్స్, హిస్టరీ సబ్జెక్ట్‌లకు సంబంధించి అర్హులైన అభ్యర్థులు ఈనెల 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సంబంధిత సబ్జక్టులో కనీసం 55 శాతం మార్కులతో పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులై ఉండాలి. నెట్, ఎస్ఎల్ఈటీ, ఎస్ఈటీ, పీహెచ్‌డీ చేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్టు తెలిపారు.